క్లుప్తంగా

వనంగుడిలో పూజలు

కురుపాం: మండల కేంద్రంలోని గ్రామ దేవత పైడిమారమ్మ తల్లి వనంగుడి ప్రతిష్ఠలో భాగంగా మొదటి రోజు వనం గుడి వద్ద హోమం కార్యక్రమాన్ని గ్రామస్తులు, ఆలయ నిర్మాణ దాతలు కొత్తకోట వెంకట సురేష్‌కుమార్ దంపతులు ఘనంగా గురువారం నిర్వహించారు. రెండో రోజైన శుక్రవారం ప్రతిష్ఠ కార్యక్రమంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పైడిమారమ్మతల్లి భక్తబృందం సభ్యులు తెలిపారు.


నేటి నుంచి పంచవర్ణేశ్వర స్వామి మహోత్సవాలు



పంచవర్ణేశ్వర స్వామి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బొద్దిడి జంక్షన్‌లోని(డుమ్మంగి) పంచవర్ణేశ్వర స్వామి పంచమ రాత్రి జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు డి.నాగరాజు, మండంగి భూషణరావు, పాలక క్రాంతికుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 28 వరకు ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు రాత్రి వేళల్లో వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతర మహోత్సవాలకు భక్తులంతా విచ్చేసి స్వామియొక్క తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న గణలక్ష్మీ సంతోషిమాత

వీరఘట్టం: స్థానిక గణలక్ష్మీ సంతోషిమాత ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్ శర్మయాజీ ఆధ్వర్యంలో భక్తులు హోమం గుండం వద్ద పూజలు చేశారు. అనంతరం పసుపు, కుంకుమలతో సంతోషిమాతకు ఉపవాస దీక్షలతో పూజలు చేశారు. శనివారం ముగింపు సందర్భంగా అఖండ అన్నసంతర్పణ కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వేడుకగా యల్లమ్మ పండగ

గరుగుబిల్లి: మండలంలోని సుంకి పంచాయతీ కెఆర్‌ఎస్.వలసలో గురువారం యల్లమ్మతల్లి వారాల పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాల నడుమ అమ్మవారి ఘటాలను ఊరేగించారు. యల్లమ్మ తల్లి వారాల పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఉత్సవాలలో భక్తులు పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న నీడ్ సంస్థ డైరెక్టర్ వేణుగోపాలరావు

గరుగుబిల్లి: రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు నీడ్ సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని ఉల్లిబద్రలో ఏపీ నీటి పారుదల జీవనోపాధుల అభివృద్ధి పథకంపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో 74 చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు చేయడం జరిగిందన్నారు. రైతులు వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో వెంగళరాయసాగర్, పెదగెడ్డ ప్రాజెక్టును సుందరీకరణ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ బి.తిరుపతిరావు, సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి, టీం లీడర్లు గౌరీశంకరరావు, రవికుమార్ తదితరులున్నారు.

బాల ఆధార్ రిజిస్ట్రేషన్ చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: బాల ఆధార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కోసూరు గీతాంజలి తెలిపారు. మండలంలోని గొయిది, పులిపుట్టి, హడ్డుబంగి గ్రామ సచివాలయాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5 ఏళ్ల లోపు పిల్లలకు రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అనంతరం గుమ్మడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల చదువులను పరిశీలించారు. మెరుగైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పందిర సాగు.. బహు బాగు



గురండిలో వేసిన బీర, దోస పందిర పాదులు

- రైతు ఇంట దిగుబడుల పంట
- 50 శాతం సబ్సిడీపై రైతుకు ఊరట
- ఉద్యానవన అధికారుల ప్రోత్సాహం

భామిని: వ్యవసాయ రంగంలో రైతుకు లాభాలు చేకూర్చే పంటలలో కూరగాయలది ప్రత్యేక స్థానం. అవే కూరగాయలను శాశ్వత పద్ధతిలో పందిరలు వేసి సాగు చేస్తే లాభాలు రెండింతలు కావడం ఖాయమని హార్టీకల్చర్ శాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. పంట పొలాల్లో శాశ్వత పందిళ్ల విధానంలో పాదు కూరగాయలు సాగుతో, అధిక లాభాలు సాధించడానికి మార్గాలు చూపుతున్నారు. చీడపీడల నివారణ, వంకర టింకర తనం లేకుండా నాజుకైన కూరగాయల దిగుబడికి పందిర సాగు దోహదపడుతుంది. తరుగుదల లేని నాణ్యత గల పంటలు పొందడంతో పాటు మార్కెట్‌లో ఆశించిన ధరలు కూడా చేజిక్కుతాయి.

బీర, చిక్కుడు, కాకర, దొండ, దోస, పొట్ల, గోరుచిక్కుడు, బరబటీల పొట్ల, ఆనప, గుమ్మడి పంటల వంటి పాదు కూరగాయల సాగును ప్రోత్సాహిస్తున్నారు. పందెర పంటలతో పాటు, పందెర్ల క్రింద తక్కువ కమతం గల రైతు సహితం శాశ్వత పందిరల పద్ధతిలో బహుళ కూరగాయలు సాగు సాధ్యపడుతుందంటున్నారు. పందెర క్రింద తక్కువ



సుస్థిర వ్యవసాయ విధానంలో పందిర బీర తరలింపునకు సిద్ధం చేస్తున్న వలస రైతు

కాలంలో వచ్చే పంటలు పండించుకోవచ్చు. పచ్చిమిర్చి, ఉల్లి, ముల్లంగి, క్యాబేజీ, ఎర్రకందమూలం, ఆకుకూరలు వంటి పంటలు సాగుకు అనువుగా ఉంటుంది. ఎకరంలో శాశ్వత పందిర కూరగాయల సాగుతో ఏడాదికి రూ.రెండు నుండి మూడు లక్షల వరకు రైతుకు లాభాలు సాధ్యపడుతుందని చెబుతున్నారు.

ఐటీడీఏ పరిధిలో..

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని భామిని, కొత్తూరు, సీతంపేట మండలాల్లో హార్టీకల్చర్ శాఖ ఆధ్వర్యంలో శాశ్వత పందిర పథకం అమలు చేస్తున్నారు. ఇప్పటికే భామిని మండలం సొలికిరి, సతివాడ, కొత్తూరు మండలం సిరుసువాడ, కుంటిబద్రలలో అమలు చేశారు. ఏభై శాతం సబ్సిడీపై శాశ్వత పందిరలు మంజూరు చేస్తున్నారు. ఎకరం నుండి పావు ఎకరం వరకు భూమి గల చిన్నకారు రైతులకు కూడా పందెర సాగు సాధ్యపడుతుంది. ఈ పద్ధతిలో సిమెంటు పోల్స్‌ను భూమి చూట్టూ వేసి పైభాగంలో ఇనుప చువ్వలను పందిరగా వేస్తారు. సాధారణంగా కర్రలతో వేసే పందిర ప్రతీ ఏడాది పాడై కొత్తగా వేసుకోవడంతో ఖర్చు పెరుగుతుంది. పందెరపై ఉన్న పంట పాడవుతుంది.

జీవిత కాలం పండించుకోవచ్చు..



ఒక ఎకరం స్థలంలో సుమారు రూ.2లక్షల వ్యయంతో పందిర వేసుకోవచ్చు. ఇందులో ఏభై శాతం అంటే రూ.1లక్ష వరకు ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తుంది. అర ఎకరంలో రూ.1లక్షతో పందిరలు వేసుకోవచ్చు. ఇందులో 50వేలు సబ్సిడీ చెల్లిస్తున్నది. ఇరవైదు సెంట్లలో రూ.50వేలుతో పందెర వేసుకోవచ్చు. 25వేలు సబ్సిడీ పొందవచ్చు. ఆసక్తి గల రైతులు నేరుగా సంప్రదించవచ్చు. భూమి చూసి సబ్సిడీ మంజూరు చేస్తాం.

– తమ్మినేని అమరేశ్వరి, హెచ్‌టీఓ, సీతంపేట

లాభాల పంట



పందిర విధానంలో ఇనుప పందిరలు వేశాం. సుస్థిర వ్యవసాయ విధానంలో కూరగాయల సాగు చేస్తున్నాం. గతం కన్నా రెండింతలు దిగుబడి సాధిస్తున్నాం. అన్ని రకాల కూరగాయలు పండిస్తున్నాం. దూర ప్రాంతాలకు డిమాండ్‌పై పంపిస్తున్నాం. నాణ్యమైన కూరగాయలు దిగుబడికి ఆలవాలంగా మారాయి. వరుస పాదుల సాగు పెంచుతున్నాం.

– చంద్రశేఖర రెడ్డి, కూరగాయల రైతు, గురండి

రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం నుంచి వంగర, కేసరి గ్రామాలకు వెళ్లే ఘాట్రోడ్డు రహదారిలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఐదు నెలల క్రితం కురిసిన వర్షాలకు ఈ ఘాట్రోడ్డులోని పురాతన రిటైనింగ్ వాల్ కోతకు గురై కూలిపోయింది. దీంతో ఈ ప్రాంత ప్రజల ఇక్కట్లను గుర్తించిన కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశారు. ఈ మేరకు రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపగా రూ.40 లక్షలు ఆర్‌అండ్‌బీ నిధులు మంజూరవ్వడంతో పనులు ప్రారంభించారు. ఈ పనులను గురువారం ఆర్‌అండ్‌బీ డీఈఈ కె.నాగమోహన్‌రావు పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నెల రోజుల్లో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తవుతాయని డీఈఈ విలేకర్లకు తెలిపారు.



రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈఈ

దరఖాస్తుల ఆహ్వానం

జియ్యమ్మవలస: మండలంలోని ఇళ్లు లేని పేదవారు ఇంటి స్థలం ఉన్నట్లు అయితే మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఉమా మహేశ్వరరావు సూచించారు. ఈ నెల 26వ తేదీ లోపల దరఖాస్తు చేసుకుంటే మంజూరు అవుతాయని తెలిపారు. అలాగే ఇప్పటికే మంజూరైన వారికి సిమెంట్ బస్తాలు వచ్చి ఉన్నాయని నిళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. బీజేపురంలో సిమెంట్ గొడౌన్‌ను గురువారం ఆయన పరిశీలించారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్మీడియెట్ గ్రూపులకు సంబంధించిన ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ గురువారం తెలిపారు. 2022 – 23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 21 నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ నెల 27 దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ అన్నారు. వివరాలకు కళాశాల పనివేళల్లో సంప్రదించాలని లేదా 9490762685 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గిరిజన విద్యార్థుల ప్రతిభ

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు గుంటూరులో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయులు ఆరిక గోవిందరావు, వసతి గృహ సంక్షేమాధికారి మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం అండర్ – 14 విభాగంలో వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన 8వ తరగతికి చెందిన టి.దీపక్‌కు, 9వ తరగతి చదువుతున్న కె.లోకేష్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పీడీ పి.చంద్రమోహన్, యోగా ఉపాధ్యాయులు టి.సునీల్‌కుమార్‌లు పాల్గొన్నారు.



సత్తా చాటిన నీలకంఠాపురం పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దు

గరుగుబిల్లి: ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించితే చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించాలన్నారు. ప్రజల ప్రాణాలతో ఆటో డ్రైవర్లు చెలగాటమాడవద్దన్నారు. డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా అమాయకులైన ప్రజల ప్రాణాలు పోతున్నాయన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించితే చట్టపరమైన చేపట్టడం జరుగుతుందన్నారు.



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ రాజేష్

ముందస్తు కొలతలు ఇవ్వాలి

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి ముందస్తుగా కొలతలను ఇవ్వాలని ఏపీడీ శ్రీహరి అన్నారు. మండలంలోని రావుపల్లిలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మస్తర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు నిర్దేశించిన వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. పని ప్రదేశంలో సాంకేతిక సహయకులు ముందుగా కొలతలు ఇచ్చిన అనంతరం పనులు చేయించాలన్నారు.



రావుపల్లిలో ఉపాధి పనుల పరిశీలన

ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు ఎన్.ఎం.ఎం.ఎస్. యాప్ ద్వారా అటెండెన్స్ వేయాలన్నారు. వేతనదారులు రెండు పూటలా పనులలో పాల్గొనేటట్లు అవగాహన కల్పించాలన్నారు. పరిశీలనలో ఏపీఓ టి.రామకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలి

కొమరాడ: గృహ నిర్మాణాలను వేగవంతం చేసి ఉగాది నాటికి ప్రవేశాలకు సిద్ధం కావాలని ఎంపీడీఓ ఎల్‌వీ అప్పారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో ఆయన గురువారం గృహ నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయంలో పెండింగ్‌లో ఉన్న స్పందన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి గోపాలకృష్ణ, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్ విజేతలు వీరే...

సీతంపేట: సీది – సామరెల్లిలో గత 5 రోజులుగా నిర్వహిస్తున్న గ్రామీణ యూత్ ఫెస్టివల్స్‌లో గెలుపొందిన విజేతలకు మన్య ప్రగతి సంస్థ చైర్మన్ జి.రవి గురువారం బహుమతులు అందజేశారు. వాలీబాల్ ఏ టీంలో మొదటి బహుమతి బుడ్డడుగూడ, రెండో బహుమతి పుబ్బాడ, మూడో బహుమతి అంటికొండ జట్లు గెల్చుకున్నాయి. షటిల్‌లో ఆముదాలవలస, కొరసవాడ, పాలకొండ జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకున్నాయి. డ్యాన్స్ కాంపిటేషన్‌లో శ్రీకాకుళం డీ క్యూబ్ (ప్రథమ), లలిత రాక్‌స్టార్ పులిపుట్టి(ద్వితీయ), డ్యాన్సింగ్ స్టార్ జల్లార (తృతీయ) బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో మన్య ప్రగతి సంస్థ ప్రతినిధులు జి.జనార్దనరావు, ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం రేపు

గుమ్మలక్ష్మీపురం: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 25న మండల సమావేశ మందిరంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన జరగనున్నట్టు ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

వైటీసీలో ఉపాధి శిక్షణలు

సీతంపేట: స్థానిక వైటీసీలో నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణలు ఇవ్వనున్నట్టు వైటీసీ మేనేజర్ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్ సెక్టార్‌లో శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. నాన్ టింబర్ ఫారెస్ట్ ప్రొడ్యూసర్ కలెక్టర్, పల్సస్ కల్టివేటర్‌లలో శిక్షణ ఉంటుందన్నారు. పదో తరగతి పాసైన యువతీ యువకులు 18 – 34 ఏళ్ల వయస్సు మధ్య గల వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 7032060773, 9550120683 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

తక్షణ సాయం అందజేత



మృతుని భార్య రవణమ్మకు తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని గరుగుబిల్లి గ్రామానికి చెందిన కెంబూరు యోగీశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ నేతృత్వంలో వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలను మృతుని భార్య రవణమ్మకు గురువారం అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు, సచివాలయ వెల్ఫేర్ సహాయకులు మాధురి, నెల్లి నాగభూషణరావు, కె.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పార్క్‌ను పరిశీలించిన లక్ష్మీశా

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు కుడి గట్టు సమీపంలో వున్న ఐటీడీఏ పార్క్‌ను రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎం.డి డా.లక్ష్మీశా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులో బోటు షికారును, పర్యాటక కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించేలా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం వుందన్నారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

పాలకొండ రూరల్: ఉపాధి హామీ పనులు సకాలంలో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. పాలకొండ మండలం అర్దలి గ్రామంలో చింతలవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. అక్కడ వేతనదారుల హాజరుపై ఆరా తీశారు. క్షేత్ర సహాయకులు విధుల్లో లేకపోవటం, మస్తర్లు అసంపూర్తిగా ఉండటాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల సందర్శనలు ఇకపై ఉంటాయన్నారు. ఈ క్రమంలో సిబ్బంది, వేతనదారులు నిర్దేశిత నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



వేతనదారుల హాజరు సరి చూస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

తాగునీటి సమస్యకు పరిష్కారం

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు గ్రామం గెడ్డవీధిలో తాగునీటి బోరు మరమ్మతులకు గురి కావటంతో నీటి సమస్య తలెత్తింది. గ్రామ ఉప సర్పంచ్ పడాల రామచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం తాగునీటి చేతి బోరుకు మరమ్మతులు చేయించారు. దీర్ఘకాలంగా ఉన్న నీటి సమస్యకు పరిష్కారం లభించిందని స్థానికులు పేర్కొన్నారు. వేసవి నేపథ్యంలో నీటి వనరుల అభివృద్ధికి అవసరమైన చర్యలు సంబంధిత అధికారుల సమన్వంతో చేపడుతున్నట్లు ఉప సర్పంచ్ తెలిపారు.



గెడ్డ వీదిలో తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

త్వరలో బేసిక్ లిటరసీ ప్రోగ్రాం

సీతంపేట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వంట మనుషులు, ఆయాలకు బేసిక్ లిటరసీ ప్రోగ్రాం త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు వయోజన విద్యా సహాయ ప్రాజెక్టు అధికారి సీహెచ్ లక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేసిక్, డిజిటల్ లిటరసీ నేర్పేందుకు వీలుగా అన్ని పాఠశాలలు సందర్శిస్తున్నామన్నారు. సీతంపేటలో 15 పాఠశాలలను సందర్శించామన్నారు. హిరమండలం, కొత్తూరుతో పాటు పలు మండలాలకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఎంతమంది నిరక్షరాస్యులు ఉన్నారనేది గుర్తిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు ఉన్నారు.



పెద్దూరు పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న సహాయ ప్రాజెక్టు అధికారి లక్ష్మి

చింతపండు సేకరణలో గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: ఈ సీజన్లో విరివిగా లభ్యమయ్యే చింతపండు సేకరణలో గిరిజనులు బిజీగా ఉన్నారు. చింతపండు దిగుబడి ఈ ఏడాది బాగుండటంతో ఉత్సాహంగా దిగుబడొచ్చిన పంటను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. చింత చెట్ల నుంచి చింత పండ్లను ఏరి, వాటిని ఎండలో బాగా ఎండేంత వరకు ఎండబెట్టి, తొక్కలను తొలగించి గ్రామాలకు వస్తున్న వ్యాపారులకు విక్రయిస్తూ గిరిజనులు లబ్ధి పొందుతున్నారు. ఇదిలా ఉండగా కిలో చింతపండును రూ.32.40 ధరకు కొనుగోలు చేస్తామని చెప్పుకొస్తున్న జీసీసీ/జీసీఎంఎస్ అధికారులు, కొనుగోళ్లను ఇంకా ప్రారంభించలేదు. మరి కొద్ది రోజుల్లో చింతపండు కొనుగోళ్లు ప్రారంభిస్తామని జీసీసీ అధికారులు చెబుతున్నారు.



మూలబిన్నిడిలో చింతపండు తొక్కలను తీస్తున్న గిరిజన మహిళలు

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు ఆశక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఎస్టీ) ప్రిన్సిపాల్ కె.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు, ఇంటర్మీడియెట్ విద్యను మధ్యలో ఆపేసిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఓపెన్ ఇంటర్‌లో చేరాలనుకునేవారు దరఖాస్తుతో పాటు పదో తరగతి మెమో, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జత చేసి ఈ నెల 27వ తేదీలోగా కళాశాలలో అందజేయాలని కోరారు. ప్రవేశం కోరే విద్యార్థులు మార్చి 1వ తేదీ నుంచి 7వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, వారికి ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వమే ఇళ్లను నిర్మించాలి

కురుపాం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజనులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను ప్రభుత్వమే చొరవ చూపి నిర్మించి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎం.డి లక్ష్మీశాకు విన్నవించారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసినా ఆర్థిక స్థోమత లేక పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారని తెలిపారు. అలాగే ఇళ్లు మంజూరు కాని వారిని కూడా గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఎండీని కలిసిన వారిలో గిరిజన సంఘం నాయకులు దుక్క సీతారాం, పల్ల సురేష్ తదితరులు ఉన్నారు.



ఎం.డి లక్ష్మీశాకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనాభ్యుదయ సంఘం నాయకులు

ప్రభుత్వ ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణలు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణలు ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ టీవీ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్ వీలర్ సర్వీస్ అసిస్టెంట్‌కు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌కు పదో తరగతి పాస్ కావాలన్నారు. 2 రోజుల్లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు, 2 పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు, బ్యాంకుఖాతా జిరాక్స్ కాపీలతో ఐటీఐకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6304033963, 9948582309 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

పెదఖర్జలో ఫ్యామిలీ డాక్టర్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పెదఖర్జ గ్రామంలో గురువారం తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి అభిలాష్, 104 అంబులెన్స్ వైద్యాధికారి జి.ప్రభాకరరావు ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందించారు. ఇంటింటికి వెళ్లి చిన్నారులు, నడవలేని వృద్ధుల ఆరోగ్యంపై ఆరా తీసి, మందులను అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం పుష్పగిరి ఆస్పత్రి ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ బి.శంకరరావు 56 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 19 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఎస్వీ ప్రకాష్, సీహెచ్‌ఓలు పి.దివ్యభారతి, ఎం.స్వాతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదఖర్జలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య సేవలు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గుమ్మలక్ష్మీపురం: నిబంధనలు పాటించని ఆటో చోదకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎల్విన్‌పేట ఎస్ఐ షన్ముఖరావు హెచ్చరించారు. ఎస్పీ విద్యాసాగరనాయుడు ఆదేశాల మేరకు ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో గుమ్మలక్ష్మీపురం మండలంలో గల ఆటో డ్రైవర్లతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నడిపే ప్రతీ వ్యక్తికి లైసెన్స్ మరియు వాహనానికి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని, యూనిఫాం ధరించి మాత్రమే వాహనం నడపాలని, పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించరాదని, అతివేగంతో వెళ్లకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ షన్ముఖరావు